International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.4, Issue-10, October, 2017
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

# మనుస్మృతి - 'స్త్రీ' స్థితి

Chebrolu Jekharaiah
M.A.,M.A.,M.Ed., S.A(Tel)
ZPHS Gullapalli, Guntur Dist, A.P.

భారత సంస్కృతి, సంప్రదాయాలకు మూలం మనుస్మృతి. "మనుస్మృతి" హిందూ ధర్మశాస్త్రనికి పునాదివంటిది. మనుభృగు మొదట ఈ స్మృతిని రచించాడు అనేనానుడి. మనువు భారత సమాజాన్ని దృష్టిలో వుంచుకొని కుటుంబ శ్రేయస్సు కోసం బిడ్డల సంరక్షణ, వివాహ వ్యవస్థ, కుటుంబ విధానం ఎలావుండాలో ఆలోచించుకొని నియమాలను రూపొందించాడు. మనుస్మృతి క్రీ॥పూ॥ 200 నుండి క్రీ.శ.2000 మధ్యకాలంలో విరాజిల్లినట్లుగా జయస్వాల్ పేర్కొన్నారు.

"యత్రనార్యస్తు పూజ్యన్తే రమంతే తత్రదేవతాః" అంటూనే "పితా రక్షతి కౌమారేభర్తారక్షతి యౌవనే" అంటూనే "స్త్రీ స్వాతంత్ర్య మర్హతి" ఇలా ఒకదానితో ఒకటి సంబంధంలేని భావాలు మను ధర్మశాస్త్రంలో కనిపిస్తాయి. మనువు ధర్మశాస్త్రంలో స్త్రీకి కొన్ని చోట్ల మంచిస్థానం కల్పించాడు. కానీ కొన్ని చోట్ల స్త్రీ పట్ల కఠినంగా వ్యవహించాడు. సంతానం కలగడానికి కారణభూతులు స్త్రీలు. వీరు మహాపకారులు వీరు వస్త్రాలు, భూషణాలతో సన్మానింపదగినవారు, స్త్రీలను సిరులుగా, సిరులు ఇంటికి కాంతినిస్తారు. సంపద లేని గృహం ఎలా రంజింపదో, స్త్రీలు లేని గృహం కూడా రంజిల్లదు అని అంటారు. స్త్రీలకు వివాహమ్, ఉపనయం, పతిశుశ్రూషే గురుకులవాసం, గృహకృత్య నిర్వహణే అగ్నిహోత్రం కాబట్టి వివాహం మొదలైన వాటిని ఉపనామనాదులతో పోల్చిచెప్పాడు. చదువు, సంధ్యల ప్రాముఖ్యం చూపలేదు. మనుధర్మశాస్త్రము ప్రకారము సమాజంలోని వివిధ వ్యక్తులు వివిధ మార్గలద్వారా ఈ సమాజంలోనికి ప్రవేశించారు అని భావించినప్పటికి 'స్త్రీ' జన్మరహస్యానికి ఒక కీలకస్థానాన్ని కల్పించారు. బ్రహ్మ తన దేహాన్ని రెండుగా విభజించి ఒక భాగాన్ని పురుషుడుగాను, మరోభాగాన్ని స్త్రీ గాను అయ్యాడు అని ఆ పురుషుడు ఆ స్త్రీ యందు విరాట్టును సృష్టించాడు. స్త్రీ, పురుషులను సృష్టించడంలో బ్రహ్మ ఎలాంటి వ్యత్యాసం చూపక పోయినప్పటికి, ఇద్దరి శరీర భాగాలు ఒకటే అయిన పురుషుడు స్త్రీ నుండి విరాట్టును సృష్టించి తన ఆదిపత్యాన్ని చాటుకున్నాడు అని అంటారు.

## 1. స్త్రీల స్వభావం - లక్షణాలు

సముద్రంలో కలిసిన మంచినీరు ఉప్పునీరుగా మారిన చందానా 'స్త్రీ' మంచి గుణాలున్న భర్తనుగానీ, చెడ్డ గుణాలున్న భర్తను గానీ ఎంచుకున్నప్పుడు ఆమె భర్త గుణాన్ని పొందుతుంది. అనేక మంది అధమ జాతిలో పుట్టిన స్త్రీలు మేలిమి గుణాలుగల భర్తలను పొంది వారి మేటి లక్షణాల వలన తాము గొప్ప వారవటం లోక మర్యాద అంటారు. ఏ స్త్రీ అయితే వాక్కునకు, దేహానికి కట్టుబడి భర్తను తప్ప పరపురుషుని కోరదో అలాంటి భార్య భర్తతోపాటు పుణ్యలోకాన్ని పొందుతుంది. ఆమె సజ్జనులచేత సాధ్వి అనిపించుకుంటుందని అంటారు. పరపురుషుని పొందువలన 'స్త్రీ'లోక నిందిత అవుతుంది. స్త్రీలకు శయ్య, భుషణాలు, కామోద్రేకాలు, కపటం, పరద్రోహం, పరహింస, కుత్సితపునడవడి వున్నాయని అందువలన వారిని పురుషులు సంరక్షించాలనంటారు.

స్త్రీలు ఆరులక్షణాల వలన చెడిపోతారు అని వాటినుండి వారిని కాపాడాలి అంటారు. అవి

1) మద్యపానం

2) దుష్టుల సహవాసం
3) భర్తను వదిలి వుండటం
4) త్రిమ్మరి తనం
5) పొరుగిండ్లలో నివశించడం
6) అసంబర్ధ ప్రవర్తన

పురుషుణ్ణి చూడగానే వానిని పొందాలనే తపనతో మనసు నిలవకుండటం వలన ప్రయత్న పూర్వకంగా సంరక్షించబడే భార్యలు వ్యభిచార దోషం వలన భర్తల మీద అనురాగం మానుకుంటారని వివరించాడు.

**2. స్త్రీలకు ప్రత్యేకధర్మాలు**

ప్రాణి ఒంటరిగా పుడతాడు. ఒంటరిగానే ఈ భూమిని విడుస్తాడు. ఒంటరిగానే సుకృతుడవుతాడు. కాబట్టి తల్లి తండ్రికన్న ధర్మంముఖ్యమని స్త్రీకి కొన్ని ముఖ్యమైన ధర్మాల్ని చెప్పాడు. బాలిక, యువతి, వృద్ధురాలు అయిన స్త్రీ ఇంటిలో స్వతంత్రగా ఏ పనినీ చేయకూడదు. ఇంటిలో నిర్ణయాధికారం ఆమెకు లేదు. స్త్రీ బాల్యంలో తండ్రి వంశంలోను, యౌవనంలో భర్త ఆదీనంలోనూ, భర్త చనిపోయిన తర్వాత పుత్రుల ఆధీనంలో వుండాలి తప్ప ఎన్నడూ స్వేచ్ఛతో జీవించరాదు. తండ్రిని, భర్తను, కొడుకును వదిలి జీవించే స్త్రీ మాతా పితరుల వంశాలు రెండింటికి చెడ్డపేరు తెస్తుంది. తండ్రి కన్యను ఎవరికి దానం చేస్తాడో అతడు జీవించి వున్నంతకాలం అతనికి సేవ చేస్తూ వుండాలి. అతడు చనిపోయిన తర్వాత మరో పురుషుణ్ని వివాహం చేసుకోకూడదు. భర్త చనిపోయిన తర్వాత పతివ్రత అయిన స్త్రీ పరిశుద్ధమైన కందమూలాలతో దేహాన్ని కృశింపచేయాలే తప్ప పరపురుషుని పేరు కూడా స్మరించకూడదు. ప్రతివ్రత అయిన స్త్రీ భర్త మరణించిన తర్వాత ఏ వ్రతాలు చేయవచ్చో అవి చేస్తూ తను మరణించే వరకు బ్రహ్మచర్యాన్ని పాటించాలి. పుత్రుల నాశించి ఏ స్త్రీ పరపురుషునితో కలుస్తుందో ఆ స్త్రీ ఈ లోకంలో నిందల పాలవుతుంది. పరలోకంలో ఆ కుమారుని వలన స్వర్గాధిపుణ్యలోకాలు పొందుతుంది. ఏ స్త్రీ మనో వాక్కాయముల చేత భర్తను వదిలి మరొకరిని కోరదో ఆమె భర్త వుండేలోకానికి వెళుతుంది. పతివ్రత అని పెద్దలచే గోరవింప బడుతుంది. మనో వాక్కుల చేత వ్యభిచారం చేయకూడదని అర్థం. అన్ని ధర్మాలను పాటించిన స్త్రీ ధర్మ మార్గంలో పయనిస్తూ గొప్ప కీర్తిని పొందుతుంది. చనిపోయిన తర్వాత భర్తృలోకాన్ని పొందుతుంది.

**3. స్త్రీలు - నియమాలు**

స్త్రీల విషయంలోనూ, వివాహ విషయంలోనూ చాలా జాగ్రత్తగా వ్యవహరించాడు మనువు. స్త్రీ గుణవంతుడిని పొందితే గుణవంతమైన సంతతి, గుణహీనుని పొందితే గుణహీనమైన సంతతి కలుగుతుంది. పరిశుద్ధమైన సంతానంకోసం భార్యను కాపాడే ప్రయత్నం చేయాలి. సంబోగాపేక్షతో తనకంటే ఉత్కృష్టజాతి పురుషుని కలిసిన స్త్రీని కొంచెం కూడా దండన చేయకూడదు. హీన జాతి పురుషుని కోరిన స్త్రీని గృహ నిర్భంధంలో ఉంచి అతడికి దూరం చేయాలి. హీనజాతి పురుషుడు ఉత్కృష్ట జాతి స్త్రీని ఆమె ఇష్టంతో గాని ఇష్టం లేకపోయినా మోహంతో అనుభవిస్తాడో అతడు లింగచ్ఛేదన వధకు అర్హుడు. సమాన జాతిస్త్రీని అతనిని ఇష్టపడిన ఆమెను పొందినపట్లయితే ఆమె తండ్రిని ఒప్పించి అతడిగి ఓలిని ఇచ్చి ఆమెను వివాహం చేసుకోవాలి. భర్త రేతస్సు రూపంలో భార్య యందు ప్రవేశించి గర్భమై అభార్య యందు పుత్రుడుగా జన్మిస్తున్నాడు. అందుకే భార్యకు జాయ అని పేరు. అంటే భర్త తన భార్య వలననే మరలా జన్మిస్తున్నాడు.

గనుక ఎల్లప్పుడు స్త్రీని రక్షించాలని మనువు చెప్పాడు. స్త్రీలను బలవంతంగా కాపాడటం ఎవరి తరమూకాదు. ధనాన్ని కాపాడటం వ్యపరచడం, శరీరాన్ని పరిశుద్ధ పరచడంలోనూ, భర్తకు శుశ్రూష చేయడంలోనూ, వంట వార్పులలోనూ, ఇంటిలోని వస్తువులను సంరక్షించడంలోనూ వారిని నియమించాలి. కాపలా వాళ్ళతో రక్షింపబడే భార్యలు రక్షితులు కాదు. ఏ స్త్రీ తనను తాను కాపాడుకుంటుందో ఆమె రక్షిత అన్నాడు. భార్య, పుత్రుడు, నౌకరు, శిష్యుడు, తోడబుట్టిన వానిని కొడుకును గురువును నిందించేవారికి గురువుకు దారి ఇవ్వాలి. వారిని బెత్తంతో కొట్టాలి. అలా కొట్టేటప్పుడు వీపు లేక శరీర భాగంమీద మాత్రమే కొట్టాలి తప్ప తలపై కొట్టకూడదు.

ఎవడు స్త్రీని తాకరాని ప్రదేశాలలో కాతుతాడో ఆ స్త్రీ తనను అట్టి తాకరాని తావులలో తాకినా ఊరుకుండునో వారు పరస్పర సంభోగాభిలాష గలవారని గుర్తించాలి. వారు దోషులవుతారు. బ్రాహ్మణేతరులు బ్రాహ్మణ స్త్రీని కోరితే వారు ప్రాణాంతమగు దండనకు అర్హులు. బ్రాహ్మణేతరుడు ఎవడు తనను కోరిన కన్యను పొందునో వెంటనే లింగచ్ఛేదన దండన విధించడానికి అర్హుడు. యజమానిచేత అడ్డగింపబడిన సేవకుడు స్త్రీలతో మాట్లాడకూడదు. అల్లా మాట్లాడితే 16 మనుగులు ఎత్తు బంగారు నాణ్యాలను అపరాధంగా చెల్లించాలి. ఈ విధమైన నియమాలను స్త్రీలు తప్పక పాటిస్తూ తమ జీవన విధానాన్ని కొనసాగించాలి అని మనువు యొక్క భావన.

**4. స్త్రీ ధనం - రకాలు**

మను ధర్మశాస్త్రం అనుసరించి తల్లి చనిపోయిన తర్వాత ఆమె పుత్రులు, పెండ్లి కాని కూతుళ్ళకు తల్లిధనం సమంగా పంచుకోవాలి. పెళ్ళయిన కుమార్తెలకు తండ్రి ఆస్థిలో లాగానే తల్లి ఆస్తిలో కూడ నాలుగవ పాలు ఇవ్వాలి. స్త్రీ ధనం ఆరు విధాలు. వివాహకాలంలో అగ్ని ముందు తండ్రి మొదలైన వారు కూతురుకిచ్చేది "అధ్యగ్ని" ఆమె అత్తవారింటికి వెళ్ళేటప్పుడు ఇచ్చేది "అధ్యావాహినిక" సంతోష సమయంలో భర్త మొదలైన వారు ఇచ్చేది. మిగిలిన సమయాలలో తోబుట్టువులు, తండ్రి ఇచ్చేది. వివాహం తర్వాత తండ్రి ఇంట్లోగాని భర్త గృహంలోగాని దొరికింది. ప్రేమతో భర్త ఇచ్చేది ఇవన్నీ భర్త జీవించియుండగా భార్య చనిపోతే ఆమె సంతానానికే, ఆమె భర్తకన్నా ముందుచనిపోతే, సంతానం లేకపోతే ఆమె భర్తకు చెందుతాయి. అసుర, రాక్షస, పైశాచిక వివాహలలో మాత్రం సంతానం లేక చనిపోయిన స్త్రీధనం ఆమె తల్లిదండ్రులకు చెందుతుంది. బ్రాహ్మణుడు నాలుగు వర్ణాలు స్త్రీలను వివాహం చేసుకుంటే క్షత్రియ, వైశ్య భార్యలు పిల్లలు లేకుండా చనిపోతే వారి స్త్రీధనం బ్రాహ్మణిసంతానానికి గాని ఆమె సవతికిగాని చెందుతుంది. భర్త జీవించి ఉన్నప్పుడు అతడు చేయించిన ఆభరణాలను అతడు చనిపోయిన తర్వాత అతని పుత్రులు పంచుకోకూడదు. అలా చేస్తే వారు పాపాత్ములవుతారు.

**5. స్త్రీ వివాహస్వరూపం - వివాహ పద్ధతులు**

కపిల వర్ణపు జుట్టునది, పెద్ద శరీరం గలది. వ్యాధి గ్రస్తురాలు, ఎక్కువ రోమాలున్నది, కఠినపు మాటలు మాట్లాడు పచ్చని కనులు గల కన్యను వివాహ మాడకూడదు. అష్ట విధి వివాహ వ్యవస్థను మనువు చూచించాడు. బ్రాహ్మం, దైవం, అర్షం, ప్రాజాపత్యం, అసుర, గాంధర్వం, రాక్షసం, పైశాచికం వంటి ఎనిమిది రకాల వివాహాలు, వీటిలో పైశాచికం అధమం, అష్ట విధి వివాహలలో మొదటి ఆరు బ్రాహ్మణులకి శాస్త్రసమ్మతాలు. అందులో మొదటి నాలుగు మేలని క్షత్రియునికి రాక్షసం, వైశ్య, శూద్రులకు అసుర వివాహం మాత్రమే మేలని పెద్దలంటారని మనువు చెప్పాడు.

**వివాహ స్వరూపం**

1. బ్రాహ్మవివాహం:- వేదమంత్రాల సాక్షిగా ఆదర్శవంతుడైన బ్రహ్మచారిని పిలిచి మర్యాదలు చేసి అలంకరించిన కన్యను
దానం చేయటం.

2. దైవ వివాహం:- యజ్ఞాలలో అధ్వర్యం చేసే ఋత్విజునకు అలంకరించిన కన్యను దానం చేయటం.

3. అర్షం:- కన్యను ఇవ్వడానికి ఒక గోవిధనాన్నిగాని రెండు వృషభాలను వరునివద్దనుండి తీసుకొని శాస్త్ర ప్రకారంగా
వరునకు కన్యనివ్వడం అర్షం.

4. ప్రాజాపత్యం:- వధువు తల్లిదండ్రులు వరుని పూజించి పిల్లనివ్వడం.

5. అసురం:- జాతులకు పిల్లకు కావలసినంత ధనమిచ్చి వాళ్ళ ఇష్టప్రకారం వివాహం చేసుకోవడం.

6. గాంధర్వం:- స్త్రీ పురుషులిద్దరి సమ్మతితో కలసి జీవించే వివాహం.

7. రాక్షసం:- కన్యబంధువుల ఇష్టం లేకుండానే వారిని నరికిగాని, చంపిగాని, చీల్చిగాని బంధునాశనం కోసం బాధపడుతున్న
కన్యను బలవంతంగా తీసుకెళ్ళి వివాహం చేసుకోవడం.

8. పైశాచికం:- నిద్రపోతున్న దానిని, పరమ పాడుతో వున్న దానినిగాని, కైపుతోవున్న దానినిగాని బలవంతంగా ఏకాంతంలో
కలిస్తే అది పైశాచికం

పెళ్ళి సంతానంలేని స్త్రీ తన మగుడు, గురువు తల్లిదండ్రులు వీరి అనుమతి పొంది మరిది వలనగాని సపిండదామాదులవలనగాని సమర్థుడైన పుత్రునిపొందవచ్చు.

**6. స్త్రీలు - సమస్యలు**

ఆనాటి కాలంలో స్త్రీలు అనేక సమస్యలతో సతమౌతున్నప్పటికి సమాజ శ్రేయస్సు కోసం పాటుపడుతూ వుండేవారు అంటారు. స్త్రీలు పడే ప్రధాన సమస్యలను గురించి వివరించారు.

ఓలి:- ఓలి అంటే కన్యాశుల్కం అని భావించారు. వరుడు కన్యను వివాహం చేసుకోదలసినప్పుడు తగిన మొత్తాన్ని ఓలిగా ఇవ్వాలి. ఓలి ఇచ్చిన తర్వాత అతడు చనిపోతే ఆ కన్యను వరుని సోదరునికి ఇచ్చివేయాలి. శాస్త్రం తెలియని వాడైనా, శూద్రుడైనా కన్యకు ఇచ్చిన ఓలిని తిరిగి తీసుకోరాదు. ఓలిని తీసుకున్నవాడు కన్యను అమ్ముకొన్నట్లే బావించాలి. స్త్రీ, పురుషులు వివాహం చేసుకుని ధర్మార్థ కామా మొక్షాలలో ఒకరి నొకరు వదలకుండా జీవించేలాగ ప్రయత్నించాలి. అది ముఖ్యమైన ధర్మం.

వదువు తండ్రి ఓలి తీసుకొని మొదటి మంచి లక్షణాలతో ఉన్న కన్యను చూపించి, తర్వాత అవలక్షణాలుగల కన్యనిచ్చినట్లయితే ఆ వరుని అదే ఓలికి ఇద్దరు కన్యలను స్వీకరించే హక్కును పొందుతాడు. వివేకి అయిన కన్నతండ్రి వరుని దగ్గర నుండి కొద్దిగానైనా ఓలి తీసుకోకూడదు. కన్యకు వివాహకాలంలో ఇచ్చిన ధరాన్ని వాహనాలను, వస్త్రాలను తాము ఉపయోగించుకున్నట్లయితే వారు అధోగతిపాలౌతారు. వివాహకాలంలో బంధువులు స్త్రీ దగ్గర నుండి సుంకం తీసుకోకపోతే అది అమ్మడంకాదు. ఆమె ప్రేమతో ఇచ్చిన ధనాన్ని ఆమె కోసమే వాడాలి. స్త్రీలను భోజనాదులచే పూజించి వస్త్రాభంగాలతో ఆదరించాలి. సకాలంలో వివాహం చేయని కన్యను వివహం చేసుకుంటే ఆ తండ్రికి ఓలిఇవ్వనక్కరలేదు. 30 ఏళ్ళనాడు 12 ఏళ్ళ అమ్మాయిని 24 ఏళ్ళవాడు 8ఏళ్ళ అమ్మాయిని వివాహం చేసుకోవాలి అంటారు. విద్యాగుణాలు లేనివాడికి కన్యనిచ్చేకంటే ఋతుమతియైన కన్యను జీవితాంతం అవివాతగా తండ్రివద్దనే ఉంచటం మంచిది అన్నాడు. స్వయంగా తానే భర్తను ఎంచుకొని వివహం చేసుకున్న స్త్రీ వివాహానికి పూర్వం ఆమెకు తల్లిదండ్రులుగాని,

అన్నదమ్ములుగాని ఇచ్చిన ఆభరాణాలను తిరిగి ఇవ్వాలి. అలా ఇవ్వకపోతే ఆమె దొంగ అనిపించుకుంటుంది. మనువు పనికాడు. ఋతుమతియైన కన్యను తగిన వరునకిచ్చి తండ్రి వివాహం చేయునప్పుడు ఆ 3సం॥లు నిరీక్షించి మంచి లక్షణాలుగల వాడుదొరకకపోతే తనతో సాటియైన వానిని వివాహం చేసుకోవచ్చు. ఇలాంటి వివాహం చేసుకోవటం వలన ఆమెకు గాని, ఆమె భర్తకు గాని ఎలాంటి పాపము వుండదంటారు. బ్రాహ్మణ కన్యను దానం చేసేటప్పుడు జలధారతో పాటుచేయాలట. మిగిలిన వర్ణాలకి ఈ నియమం లేదంటూ కన్యాదనంలోకూడా వర్ణ విభేదాన్ని మనవు ప్రదర్శించాడు.

**<u>మనుస్మృతి - ప్రస్థానం</u>**

భారత సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు అద్దంగా నిలిచిన మనుస్మృతి కాలగమనంలో అనేక విమర్శలకులోనై దాని విశిష్టత కోల్పోయింది. మారుతున్న దేశకాల మానపరిస్థితుల వలన సమాజంలో పెనుమార్పులు వచ్చాయి. ఆడది అబల అనే భావం పూర్తిగా మారిపోయి సబలగా రూపుదిద్దుకొంది పెక్కుమంది సంఘ సంస్కర్తల మొక్క ప్రభోధం ఫలితముగా సమాజంలో క్రమముగా మార్పువచ్చింది. మనువు పేర్కొన్న పెక్కు అంశాలు విమర్శకు గురిఅయ్యాయి. ముఖ్యముగా స్త్రీల పట్ల మనువు యొక్క వైఖరిని పెక్కుమంది ఖండించారు. స్త్రీలను ఆరాధ్య దైవంగానే భావిస్తూనే ఆమె పై అనేక ఆంక్షలు విధించుటం సభ్యసమాజం నిరసించింది. రాజా రామోహన్‌రాయ్, ఈశ్వర చంద్ర విద్యాసాగర్, కందుకూరి వీరేశలింగం జ్యోతిరావు పూలే వంటి సంఘ సంస్కర్తలు స్త్రీలు స్వతంత్రులు కావడానికి, స్వయంగా ఆలోచించటానికి వారిలోని అజ్ఞానాన్ని ప్రాలద్రోలటానికి విద్య ఒక్కటే మార్గం అని భావించి స్త్రీలకు ప్రత్యేక పాఠశాల స్థాపన ద్వారా స్త్రీ విద్యను ప్రోత్సహించుట జరిగింది. ఫలితముగా స్త్రీ వంటింటి కుందేలు అనే భావన తొలగిపోయి స్వతంత్రురాలు కావడం స్వయంగా నిర్ణయాలను తీసుకొనే స్థితికి ఎదగడంతో పాటు విద్య, వైద్య, ఆరోగ్య, శాస్త్ర, సాంకేతిక రంగాలలో మేటిగా తయారు అయ్యే నేటి సమాజములో ఒక బలమైన శక్తిగా నిలచింది. మను స్మృతి నేటి సమాజం నివసించినప్పటికి ఆనాటి దేశాల కాలమాన పరిస్థితుల దృష్టి భారతదేశంలో వసుదైక కుటుంబస్థాపనకు మనుస్మృతి కారణభూతమైనది అని చెప్పక తప్పదు.

ఆధార గ్రంధాలు:

1. మను ధర్మశాస్త్రం - సవ్యాఖ్యానాంధ్ర తాత్పర్యము
2. తెలుగు సాహిత్యం - మహిళాభ్యుదయం